సర్వేలతో సరి!

- బహిర్గతం కాని లోగుట్టు
- ఏటా తప్పని ముంపు భయం
- తాత్కాలిక చర్యలతో మమ
- మేహాద్రి గెడ్డ గేట్లు ఎత్తితే ముంపు తప్పదంటూ ఆందోళన
- సమగ్ర సర్వే చేయాలని కోరుతున్న స్థానికులు


గెడ్డ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ (ఫైల్)

గోపాలపట్నం: వర్షాలు కురిస్తే ఆ ప్రాంత వాసుల వెన్నులో వణుకు పుడుతుంది. ఎక్కడ వరదనీరు ఇళ్లలోకి చేరుతుందనే భయం వెంటాడుతుంది. టీవీల్లో వరద వార్తలు చూస్తే చాలు ఇక్కడ పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతారు. ఏటా ఇదే పరిస్థితి ఉన్న పాలకులు, అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం, కొత్తపాలెం పాత ఊరు, భగత్ సింగ్ నగర్, యల్లపువానిపాలెం ఎస్సీకాలనీలు, సాయిగణపతినగర్ శివారు ప్రాంతాలుగా ఉన్నాయి. ఇటీవల శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయితే అదే స్థాయిలో ఈ ప్రాంతంలోని గెడ్డలు, కాల్వలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో భారీ వర్షం కురిస్తే రోడ్లు చెరువులా మారుతున్నాయి. 2021-22లో భారీ వరదలు వచ్చి ఈ ప్రాంతమంతా మునిగిపోయింది. చాలా మంది కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బయటపడాల్సి వచ్చింది. ఈ పరిస్థితి భగత్‌సింగ్ నగర్ జంక్షన్ నుంచి నరవ వెళ్లే దారిలో ఎక్కువగా ఉంటోంది.

తూతూ మంత్రమేనా...

ఈ ప్రాంతంలో వరద ముప్పు లేకుండా చేయడానికి 2021 నుంచి పలు దఫాలుగా సర్వేలు నిర్వహించారు. ప్రతీ ఏటా జీవీఎంసీ కమిషనర్లు, జాయింట్ కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఇక్కడి కాల్వల వాస్తవ పరిస్థితులు గురించి సర్వేలు చేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో వాటి వివరాలు బయటకు రాలేదు. అభివృద్ధి జరగలేదు.


చిన్నపాటి వర్షానికే రోడ్డెక్కిన నీరు

పాక్షిక చర్యలతో సరి

ముంపులేకుండా పాక్షిక చర్యలతో సరి పుచ్చుతున్నారు. పెద్ద వర్షాలు పడితే మాత్రం భవిష్యత్తులో ఈ ప్రాంతమంతా ముంపునకు గురవుతుందని ప్రజలు వాపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. మేహాద్రి గెడ్డ గేట్లు ఎత్తితే వచ్చే నీరు నేరుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ వరద ప్రభావం ఎయిర్‌పోర్టుపై పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో ఇదే విధంగా రన్‌వే వరకు వరద నీరు వెళ్లడంతో ఇబ్బందులు తలెత్తాయి. పరిష్కారం లేని సమస్యగా మిగల్చకుండా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి ముంపు సమస్యకు చెక్ పెట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గెడ్డల ఆక్రమణే కారణం

ముంపు సమస్యకు గెడ్డలు ఆక్రమించడమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇవి మంచి నీటి గెడ్డలని.. వర్షపు నీరు వెళ్లేందుకు మేహాద్రి గెడ్డ ఎగువ నీరు సముద్రంలోకి వెళ్లేందుకు ఈ కాల్వలు ఏర్పడ్డాయంటున్నారు. కొత్తపాలెం పొలాల నుంచి వచ్చి ఎయిర్‌పోర్టు వద్ద ఉన్న కాల్వల్లోకి వెళ్లి సముద్రంలో నీరు కలుస్తుందని చెబుతున్నారు. అనధికార లేఅవుట్లు, గృహ నిర్మాణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. కాల్వలు ఆక్రమించి గృహాలు నిర్మించడం.. అడ్డదిడ్డంగా నిర్మాణాలకు అనుమతులివ్వడం వల్ల ముంపు సమస్య తలెత్తుతోందని ఆరోపిస్తున్నారు.


పిచ్చి మొక్కలతో నిండిన గెడ్డ


ఆక్రమణలతో కుచించుకుపోయిన గెడ్డ

విన్నపాలు వినవలె...


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై 5 వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము నేరుగా వినతులు స్వీకరించారు. ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, యూజీడీ విభాగానికి 02, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మారావు మాస్టారికి తెలుగు తేజం పురస్కారం



మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న యు.వి.ధర్మారావు తెలుగు తేజం పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతుల జయంతిని పురస్కరించుకుని నర్సారావుపేట వద్ద నిర్వహించనున్న కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఈ పురస్కారాన్ని మాస్టారికి అందజేయనున్నారు. ధర్మారావు ఉపాధ్యాయుడే కాక రచయిత, తెలుగు భాషా పరిరక్షకుడు కూడా. ఆయనకు అవార్డు రావడంతో శ్రీహరిపురం హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణాలయంలో పూజలు


కృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులతో కార్పొరేటర్ సురేష్

మల్కాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా 60వ వార్డు జవహర్‌నగర్‌లో బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మకుమారి సింధూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొన్నారు. కృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులను ఆయన అభినందించారు. పూజల్లో వందలాది మంది పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మల్కాపురం: బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ పశ్చిమ ఇన్‌చార్జి అతుకుమిశెట్టి రామచంద్రరావు డిమాండ్ చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఆ పార్టీ నాయకులు పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్కాపురంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 2012లో నాటి ప్రభుత్వం బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు ప్రకటించిందన్నారు. నేటికీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 25వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

జోరువానలోనూ విధి నిర్వహణ

- ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు
- ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సిబ్బంది కృషి


ములగాడ గెడ్డ వద్ద నిలిచిన వ్యర్థాలను వర్షంలోనూ తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు


జోరు వానలోనూ విద్యుత్ స్తంభం ఎక్కి విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

మల్కాపురం: ప్రజలకు ఇబ్బంది కలగకుండా జోరువానలో, ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రశంసలందుకుంటున్నారు పారిశుధ్య, విద్యుత్ విభాగాల సిబ్బంది. మోకాలి లోతు నీరు ఉన్నా.. చెరువులను తలపించే రోడ్డుపై గోతులు ఎక్కడున్నాయో, పడితే ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆలోచన అయినా లేకుండా శ్రమిస్తున్నారు. పారిశుధ్య కార్మికులు పార పట్టుకుని మురుగు నీటిలోనూ, బురదలోనూ దిగి నీటి ప్రవాహం ఎక్కడా ఆగకుండా పనులు చేపడుతున్నారు. ఇక విద్యుత్ సిబ్బంది కూడా తడిచిన స్తంభాలపైన ఎక్కి, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నారు.

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు 58వ వార్డు ములగాడ, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లోని గెడ్డలు పొంగి మురుగు నీరు సర్వీస్ రోడ్డుపైకి వచ్చింది. దీంతో ప్రజల ఇబ్బందులను గుర్తించిన వార్డు శానిటరీ అధికారి సోమవారం ఉదయం వర్షంలోనూ ఆయా ప్రాంతాలకు వెళ్లి, మోకాలి లోతు నీటిలో దిగి వ్యర్థాలను తొలగించారు. సమస్య లేకుండా చర్యలు చేపట్టారు.

- మల్కాపురం గాంధీజీ వీధి తదితర ప్రాంతాలలో భారీ వర్షం కారణంగా విద్యుత్ సరఫరా సమస్య తలెత్తడంతో మల్కాపురం సబ్‌స్టేషన్ సిబ్బంది ఆయా ప్రాంతాలకు వెళ్లి, విద్యుత్ స్తంభాలపైకి ఎక్కి మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

రహదారులు జలమయం

- రాకపోకలకు అవస్థలు
- సాయంత్రానికి శాంతించిన వరుణుడు


నౌసేనాబాగ్ ముఖ ద్వారం వద్ద నిలిచిన నీరు


రిక్షా కాలనీ రైల్వే ట్రాక్ వద్ద నిలిచిన నీరు


90వ వార్డు కొండవాలు ప్రాంతం పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు


ఐవోసీ మార్గంలో నిలిచిన వ్యర్థాలను తొలగిస్తున్న పొక్లెయిన్

మల్కాపురం: అల్పపీడనం ప్రభావంతో పారిశ్రామిక ప్రాంతంలో రెండో రోజు సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లపైవర్షపు నీరు నిలిచింది.నౌసేనాబాగ్ ముఖ ద్వారం వద్ద భారీగా నీరు నిలిచిపోయింది.అలాగే మల్కాపురం,హెచ్‌పీసీఎల్ ప్రధాన ద్వారం వద్ద నీరు నిలిచి చిన్న పాటి చెరువులను తలిపించాయి. ఐవోసీ సేవా మార్గం వద్ద భారీగా నీరు నిలిచిపోవడంతో శానిటరీ సిబ్బంది పొక్లెయిన్‌తో గెడ్డలు, రోడ్లపై వ్యర్థాలను తొలగించారు.కాగా సాయంత్రం తర్వాత వర్షం తగ్గడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. తమకు కావాల్సిన వస్తువులు కొనుగోలు చేసుకున్నారు.

జనజీవనం అస్తవ్యస్తం

విశాఖ విద్య: ఎడతెరపిలేని వర్షాలతో ప్రజానీకం రోజువారీ పనులకు ఆటంకం కలిగింది. జీవీఎంసీ 52,90వ వార్డు పరిధిలో పలు చోట డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి వచ్చాయి. రిక్షా కాలనీ వద్ద యూజీడీ పైపులైన్లు నుంచి నీరు పైకి రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ బొమ్మిడి రమణ పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్య చంద్రరావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలన్నారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసి సెన్సార్ల నుంచి పరికరాల వరకు దేశీయ సాంకేతిక ఉపకరణాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం


సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

నేతాజీ ఆశయాలకు పునరంకితం కావాలి


నివాళులర్పిస్తున్న షారోన్ రాజు, తదితరులు

విశాఖ విద్య : స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్య్ర పోరాటంలో సుభాష్ చంద్రబోస్ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయ యువతను స్వాతంత్య్ర ఉద్యమం దిశగా నడిపించిన విధానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బ్రిటిష్ వారికి మన సత్తా చాటే విధంగా ఆయన దీనిని తీర్చిదిద్ది నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థులు ఇటువంటి మహనీయులను, స్ఫూర్తిదాతలను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని సూచించారు. భవిష్యత్ ఉపాధ్యాయులుగా మారే మీరంతా చిన్నారుల్లో దేశ భక్తి నింపేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ అలీ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి


పాత కట్టడంలో నివసిస్తున్న వారికి జాగ్రత్తలు చెబుతున్న జెడ్సీ

జగదాంబ: వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన జోన్ పరిధిలో 12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు అధికంగా ప్రవహిస్తున్న వీధులను పరిశీలించారు. కాలువల్లో చెత్తను పారిశుధ్య కార్మికులతో తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధుల్లో మురుగు నీరు, బురద చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. బ్లీచింగ్, ఫినాయిల్ జల్లాలన్నారు. ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. తుపాను నియంత్రణ గది ఏర్పాటు చేశామన్నారు. అలాగే 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించి పాతభవనాల్లో నుంచి బయటికి తీసుకొచ్చి జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఈవోఐలను తక్షణం రద్దు చేయాలి


ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ఈవోఐలను తక్షణమే రద్దు చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వీటికి వ్యతిరేకంగా సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుమతితోనే ఉక్కు యాజమాన్యం ప్లాంట్‌లోని 32 విభాగాల్లో 44 ఈవోఐలను ప్రకటించిందన్నారు. ఈ చర్య ప్లాంట్‌ను పూర్తిగా ప్రైవేటీకరించడమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పిన ప్యాకేజీలో భాగంగా ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులను పెద్ద ఎత్తున తొలగించారన్నారు. పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించారని పేర్కొన్నారు. వీరికి ఏడాదిగా పూర్తి జీతం చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్ భూముల్ని ఎన్‌ఎండీసీకి ఇచ్చినప్పటికీ వారి నుంచి కాకుండా ఖుద్రేముఖ్ ఐరన్ ఓర్ నుంచి పెల్లెట్లు ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. ఈ సమస్య రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నప్పటికీ వారు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు రమణమూర్తి, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావులు మాట్లాడుతూ కూటమి ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, మోహన్‌బాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.